
# ఛత్రగ్రాహి



డాక్టర్: నేలటూరి వేంకటరమణయ్య

దినమంతయు శ్రమపడుటచే ప్రాణము బేజారయిపోయినది ప్రోలయకు. రాయలదేవునికి బరిచర్యసేయుచు నుదయాస్తమయము తిరుగవలసి వచ్చెను. పూర్వాహ్ణమున కొలువుకూటమున రాయ పరివారజనముతోపాటు శ్వేతచ్ఛత్రమును బట్టుకొని వజ్రసింహాసనము వెనుక నిలిచియుండెను; రాయదేవుడు దినసరి రాజకార్యములను నెఱవేర్చుకొని, బహమనీ సుల్తాను నోడించుటకు తోడ్పడిన నాయకులకును పాళెగాండ్లకును నొంటర్లకును వారివారి పరాక్రమమునకు దగినట్లు బహుమాన సత్కారముల నొనర్చి కొలువు చాలించువరకును విడుమర లేకపోయినది. సత్కారవిషయమును గూర్చి చింతింపగా నేవిధమైన గౌరవమును పొందనివాడు తా నొక్కడే. సరివారిలో దన కెంత చిన్నదనమైనది. రణక్షేత్రమున పరాక్రమ ప్రదర్శనమున దానెవ్వరికిని తీసిపోలేదు. రాయదేవుని కొలువున దనకంటె నతిశయముగ నాత్మసమర్పణ మెవ్వరును గావించియుండలేదు. కాని తనకు సత్కారము గలుగకపోవుట, స్వయంకృతాపరాధమునకు ఫలితము. తన సేవకు మెచ్చి స్వామివారు తనకేమికావలయునని సెలవియ్యగానే ప్రభువును ప్రసాదింపరాని కోరికను గోరుట తన తెలివిమాలినతనము గాని, యేలినవారి తప్పేమికలదు? కాని ఏలినవారు తనకేదేని యొక బిరుదునిచ్చియుండకూడదా? పోనీ, యెంతటి యల్పమైనదియైనను నొక గండపెండేరమునో, వీరశృంఖలమునో ప్రసాదించియుండరాదా? అవును, రాజుల చిత్తవృత్తియట్టిది. ఆశ్రితుల హృదయములను తృప్తిపఱచగల శక్తి దానికిలేదు. ఈ యవమానమువలన గలిగిన వ్యధకు దోడు పుండుమీదియుప్పువలె రాయసత్కారమునకు బాత్రులైన తోడిపరివారజనుల గూడి సాయాహ్నమంతయు మరల నగరిచాకిరి సేయవలసి వచ్చెను. పట్టణమునందలి దేవాలయముల నన్నిటికిని, తురకలపై విజయము గలిగించినందులకై తదధిష్ఠదేవతలకు దనకృతజ్ఞతను జూపుటకు రాయదేవుడు బయలుదేరగా నాయనను వెన్నంటి గొడుగును బట్టుచు దానును పోవలసివచ్చెను. హృదయవిదారకమైన యవమానమునకు గ్రుంగిపోక తానెట్లోర్చుకొని తన సేవాధర్మమును నెఱవేర్పగలిగెనో యతనికే తెలియదు; కాని యాబాధ యెట్లో నివర్తియైపోయినది. ముత్యాలజల్లుల గొడుగును కోణేవాకిటికడ నంతఃపుర ఛత్రగ్రాహిణి కొప్పజెప్పెను.

ఇష్టమువచ్చినంతసేపు తన గొడవయందు పడి యుండవచ్చును. మరుసటి యుదయమువఱకు నను దన్నడుగువా రుండరు.

బయలుదేరినాడు తలారిగట్టుప్రాంతమునందు దన యింటికి. నిజసత్కారార్హతయు రాయలవారి యౌదాసీన్యమును దలపోసికొనుచు పయనము సాగించుటచే బహిఃప్రపంచమున నేమి నడచుచుండినదియు నతని మనసునకెక్కలేదు. మామూలు ప్రకారము దన యింటికి మిక్కిలియు సమీపమైన యడ్డదారిని ద్రొక్కెను. శీఘ్రముగ బోవలయు ననుకొనిన నతఁడు హజారరామస్వామి గుడినుండి బయలుదేరి పాన్‌సుపారి సూళై బజారుల గుండ నడచి యటు పిమ్మట నచట నచట కూరగాయల తోటలుగల విజనప్రదేశమును దాటి, విఠలస్వామి యాలయ ప్రాంగణమునుండి పూర్వాభిముఖముగ బోయి యానెగొంది రేవున కించుక దక్షిణమున తలారిగట్టును గలియు సంత వీథిని జొచ్చి పోవలసి యుండెను. సూళై బజారున కతఁడు వచ్చునప్పటికి సంజెప్రొద్దు గడచినది. ఇరులు గ్రమ్మినవి. అచట నచట ధనసంపన్నురాండ్రైన వేశ్యకాంతల ముంగిళ్లయందును, దమ ప్రియురాండ్ర కౌఁగిళ్ల కాశించి బిరబిర నడచెంచు దండనాయక ప్రధాన సామంతాదులతో వచ్చు పంజు వెలుఁగులు బడు తావులయందును దప్ప వీథి యంతయు నంధకారమున మ్రుంగియుండెను. సూళై బజారుదాటి విజన ప్రదేశము జొచ్చువఱకును నతనికి మార్గమున నేయాటంకమును దగులలేదు. విఠలస్వామి యాలయమునకు ఇంకను చాలదూరములేదు. పందె కొలువు వాద్యముల మ్రోఁత స్పష్టముగ వినవచ్చుచుండినది. ఇఁక రెండుమూఁడు నిమిసములలో విజన ప్రదేశమును దాటి దేవాలయ ప్రాంగణమును జేరవచ్చును. దారిప్రక్కనుండు నొకకూరగాయల తోటను దాటి పదిబారలు నడచినాఁడో లేదో వెనుక నడుగుల చప్పుడైనట్లు తోఁచినది. తన వెనుక చీకటియందు వచ్చువా రెవ్వరో కనుగొను టకు వెనుదిరుగ నుద్దేశించెను; కాని వెనుకనుండి యెవ్వరో చుట్టును పాశమువేసినట్లు అతనికంఠము నందిట బిగియబట్టి, నోట గుడ్డను గ్రుక్కి, కండ్లపై గంతను బిగించి, కాలుసేతులు గట్టివైచిరి; తరువాత తలనొకఁడును నడుము నొకడును గాళ్ళ నొక్కడును బట్టి మోసికొనిపోయి యొక వాహనముపై గూలవేసిరి. దాని చలనమును బట్టి చూడగా నది మనుష్యులు భుజములపై మోసికొనిపోయెడు పల్లకివంటి వాహనమను తలంపు కలిగినది.

దాదాపు రెండు గడియలకాలము ప్రోలయ యందుండెను అదియే యతనికొక యుగమై తోఁచినది. కడపట నావాహన మాగెను. వెంటనే ప్రోలయనందుండి బయటికీడ్చి పడవైచి యతని బంధనములను దొలగించిరి; బంధవిముక్తములైన చేతులతో నతడు నోట గ్రుక్కియుండిన గుడ్డలను లాగివేసి కంటిగంత నూడదీసి పాఱవైచెను; కాని యందువలన నతని కేమియు లాభము గలుగ దాయె. గాఢాంధకారము; కన్నులముందుంచుకొనినను అఱచేతులు సైతము గనిపించ వాయె. తడవి చూచినాడు - మెత్తలు కుట్టిన మంచము మీదనో లేక యట్టి వేఱొక శయ్యయందో పడి యుండినట్లు స్పర్శవల్ల దెలియవచ్చినది. సగము కూర్చుని మాటలాడ ప్రయత్నపడినాడు. వెంటనే ముఖముపై నడిచినట్లు వచ్చినది భీకరస్వరమున దక్కనీలో జవాబు. 'ఊసుఱుపై నాశయుండిన వాగకుము. రేపటి యుదయమువఱకును నీ విచటనే పడియుండవలయును-తరువాతి స్థితి నీకె యెఱుక కాగలదు' అని. అటుపై నోరుదెఱచుటకు ధైర్యము లేకపోయినది ప్రోలయకు.

కొంతకాలము దానెచ్చట నుండునదియు నూహించి కనుగొనవలయునని ప్రోలయ వ్యర్థముగ జింతించుచు గూర్చుండియుండెను. ఎంతయోచించి చూచినను సాధ్యపడలేదు. అంతట నచటినుండి తప్పించుకొనిపోవుట యుక్తమని యెంచెను. మంచముపైనుండి లేచి చీకటిలో దడవుకొనుచు రెండు మూడడుగులు ముందునకుసాగెను. అంతట నతని యడుగుత్రాటివలెనిడుపై రోమమయమైన మెత్తని వస్తువుపైబడినది; వెంటనే గుఱ్ఱుమను భీకరశబ్దము చెవిసోకగా భయముచే దద్దరిలి వెనుకంజవేసినాడు. మంచము అడ్డుదగులగా దానిపై గూలపడినాడు. తప్పించుకొను ప్రయత్నమును మానుకొని తనస్థితిని గూర్చి చింతించుచు పండుకొన్నాడు. తన్ను బట్టి బంధించినవారెవ్వరో ? ఎవ్వరైననేమి, శత్రులగుదురుగాని మిత్రులుగాజాలరు; ఏకారణముచే వారు తన్ను చెఱపట్టినను వారివలన దనకు కీడుకలుగు ననుట నిశ్చయము. వానిలో గనిన మొక్కడైనను

మహామ్మదీయుడై యుండవలయును. ఏలనగా, నందిట తనకంతము నిరీక్షించుకొనినవానికి గడ్డ ముండినది; మహామ్మదీయులు గానివానికి గూడ గడ్డముండవచ్చును; కాని తాను మాటలాడ ప్రయత్నము సేయగా దన్ను నోరెత్తవలదని యాజ్ఞాపించినవాడు తెనుగుననో కన్నడముననో భాషింపక దక్కనీ నవలంబించుటను జూడ కర్ణాటకసామ్రాజ్యమున వాడుకయందుండు భాషల నెఱుగని మహామ్మదీయుడను నూహాడకెడమిచ్చుచున్నది. తానూహించినట్లు తన శత్రువులు మహామ్మదీయులగుట నిశ్చయమగుపక్షమున, వారెవ్వరై యుందురో? రాయలవారి కొలువున నెందఱో మహామ్మదీయులు గలరు; వారందఱును దన కెఱిగిన వారే; కాని వారెవ్వరికిని దనమీద క్రోధము గల దని యెంచుట కవకాశములేదు. ఇటీవల బహమనీ సుల్తాను దండయాత్రయం దొక ఘోరసంగ్రామమున, ప్రఖ్యాతుడగు నాఘ్నానమీరొకడు దనచే మడిసినదిమాత్రము వాస్తవమే. కాని యతనివారికి విజయనగరమునకు రానెట్లుసాధ్యపడినది? వచ్చిరిపో, స్వయము రాయలవారి యనుచరులలో నొక్కని చెఱబట్టుట కెట్లు వలనుపడినది? ఇట్టి దుండగము రాయరాజధాని నడివీథులలో జరుగుచుండగా, పట్టణ ప్రధానతలారి జంగమయ్య చక్రవర్తి శత్రువుల నడవడిని గనిపెట్టజాలక యేమిచేయుచున్నాడో? బహమనీసుల్తానుతోడి యుద్ధమున స్మరింపగనే ఆయుద్ధముననే శత్రువులను బొడిచి సూర్యమండలమును భేదించుకొని యా మార్గమున వీరస్వర్గమున కెక్కిన యతని యేక పుత్రుండు జ్ఞప్తికివచ్చెను. తనకిక పుత్రసంతతిలేదు; తన్ను జిక్కించుకొనిన శత్రువులు తన్ను వధింపక విడువరు; అంతట తన వంశ మంతరించిపోవును. తన భార్యలందఱు సహగమనముజేసి మహాసతు లగుదురు. తన కుటుంబము సర్వనాశన మైపోగలదు. భార్యలను దలంచుకొన్నప్పుడు ముఖ్యము గడగొట్టు భార్య యతనికి గన్నులముందు పొడగట్టినట్లయినది. దానియెడ నతనికి మమత యెక్కుడు- చిన్నది; రూపమున మోహినియే. రాయలయంతఃపురమునగూడ దాని కుద్దిసేయగల అందకత్తియ కానరాదు. మరులు గొలుపుటయందు దాని కీడైన యాడదిలేదు. పూవువలె మృదులమైనది దాని శరీరము. ఆ చిన్నది, ఆ మోహానాంగి, ఆ నవకుసుమకోమలశరీర, చితియెక్కి భుగభుగమండు నగ్నిజ్వాలలోమాడి మసియై పోవలసినదేనా? ఆ క్రూరవిధినితప్పించుటకుమార్గములేదా? అనియున్నరని కన్నుల నీరు వెట్టుకొనుచు మహా హృదయ వేదనతో పడకపైబొరలుచుండెను. బాధపడి బాధపడి తుదకు చిరకాలము మనశ్శరీరములు శోషిలుట వలన నెప్పుడో యతని కన్నులు మూతలు బడి పోయినవి. ఆత్మ సొమ్మసిల్లినది.

* * *

మెళకువ వచ్చినది; కాని నిద్రమత్తు సంపూర్ణముగ దొలగిపోదు. చలి. దేహముపైనుండి జారి పోయిన శాలువను చేతులతో దడవి మీదికీడ్చి కప్పుకొని నిద్రించుటకు ప్రయత్న మొనర్చినాడు ప్రోలయ. ప్రాగన్ను వడినది. ఊబిలో ప్రుంగు ఘన పదార్థమువలె సత్వరముగ గ్రుంక నారంభించినద అతని చైతన్యము అజ్ఞాత హృదయాంధకార సీమలోనికి. పంచమహాశబ్దము లెచటనో మ్రోగుచున్నట్లు తోచినది. ఏదో దేవాలయములోనని తన మనస్సునకు సమాధానము చెప్పుకొన్నాడు. ఇంతలో వినవచ్చినది,—

'మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, అరిరాయవిభాళ, భాషగెతప్పువరాయరగండ, మూరురాయరగండ, అష్టదిగ్రాయ మనోభయంకర, హిందూరాయసురత్రాణ, యవనరాజ్యస్థాపనాచార్య, సాహితీసమరాంగణసార్వభౌమ, జయా-విజయీభవ, దిగ్విజయీభవ—"

అను వందిజనుల కైవారము. వెంటనే చెవి సోకినది,—

'నాడు నేడును యాదవాన్వయమునందు
జననమందెను వసుదేవ మనుజవిభుని
కృష్ణుడనుపేర నరసేంద్ర కృష్ణదేవ
రాయ డనుపేర నాదినారాయణుండు'

అను మాగధుల స్తోత్రపాఠము. 'ఇంకను చక్కగ నిదురపట్టనే లేదు; అప్పుడే ప్రారంభమైనది కల' యని యబ్బురపడినాడు ప్రోలయ. ఎవరో ఆధ్యాత్మ సంకీర్తనలు పాడుచుండుట వినవచ్చినది; అంతటనతనిచైతన్యముసంపూర్ణముగ నిద్రలో మునిగినది. కాని చాలకాలము నిద్రపోలేదు. 'దేవ, అవధారు! తెల్లవారవచ్చినది. ఏలినవారు కాల్యకృత్యములను నెఱవేర్చుట కిది యవస

రము' అను వాక్కు స్పష్టముగ వినవచ్చినది సమీపమున. ఉలికిపడి లేచి కూర్చున్నాడు. చుట్టును వినవచ్చినవి పారావతకీరశారికాదుల కూంతలు. అతనికి సందేహము గలిగినది. మాంజిష్ఠ తెరను దొలగఁద్రోసి చూచినాడు. ఎదుట నిలబెట్టి యుండిన బంగారుచట్టపు వెనీసు నిలువుటద్దమున గానవచ్చినది, సకినలమంచముపై గూర్చుండి యుండుతని ప్రతిబింబము. తికమకపాటు కలిగినది. అంతదనుకనతడు తన యింటనె నిద్రించుచుంటినని యెంచినాడు. తన యింట సకినల మంచముగాని, మాంజిష్ఠ పట్టుతెరగాని, బంగరుచట్టపు వెనీసు నిలువుటద్దముగాని లేవు; పరిశీలించిచూచు నుద్దేశముతో మంచము దిగుటకొఱకు కాళ్ళను క్రిందికి జాఱవిడిచినాడు; గట్టిగ పలకలవలె నేవో పాదముల సోకినవి. వంగిచూచినాడు; కాన వచ్చినవి క్రింద వరాహముద్రాంకితములైన బంగారుపావలు. వాని జూడగనే అతనికి ఆశ్చర్యమును భయమును గలిగినవి. అవి తన పాదరక్షలుగావు, మఱి యెవ్వరివియుగావు. రాయసామ్రాజ్యమున నా పావలను మెట్టసర్హుడు రాయదేవేంద్రుఁడొక్కఁడే. రాయల దేవుని పాదరక్షలు దన పడకటింటి కెట్లువచ్చినవి? అని చింతింపుచు వానికి పాదములను దాకనీయక నోరగ మంచము దిగి నలువైపుల బరిశీలించి చూచినాడు. ఏమి చిత్రము? ఆ పడకటి ల్లెచ్చటిది? అట్టి చక్కని మందిరమున దనవంటి యల్పుడు నిద్రించు భాగ్యమెట్లుగలిగినది? స్నిగ్ధముగ మెరుగు పెట్టి వెండిరేకులవలె తెల్లనైన గోడలును; వాని మధ్య నచటనచట చిత్రింపఁబడియుండు రతీ మన్మథ రంభానలకూబర దాశకన్యాపరాశర ఊర్వశీపురూర వాది యపరూప శృంగారచిత్ర పటములును, వాతావరణ మంతటను గుబులుకొను నగరుచందనాది సుగంధ ద్రవ్యముల వాసనలును దనవంటి సామాన్యుల గృహములనుండునవి కావు. చూడఁగా రాయలదేవుని యంతఃపురములోని పడకటింటివలె గానవచ్చినది. తానచటి కెట్లురాగలిగెను? చక్రవర్తి పడకపైనిద్రించుట యెట్లుసంభవించినది? పూర్వదినము నడచిన వర్తమానమును స్మరణకు వచ్చినది. తన్నుబంధించి తెచ్చినవా రెవ్వరు? ఈపడకటిల్లెచ్చటిది? వారే తన్నిచ్చటికి దెచ్చిరా? వారి వేషభాషలు మహమ్మదీయులను గదా పోలి యుండినవి? అగునేని రాయదేవుని యంతఃపురముతో వారికేసంబంధము గలదు? అని యిట్లు



తనలోదాను తర్కించుకొనుచుండగా, హేమ వేత్రధారిణి యొక యువతివచ్చి యెదుట నిలిచి పలికినది, 'దేవ, అవధారు! కన్యకా, కపిల కామధేను స్పర్శన విప్రదర్శనములకు అవసరము' అని. అప్పటికే కలతపడియుండిన మన స్సా మాటలు

వినగనే మఱియు జిక్కులపాలైనది. తన సందేహముల నెట్లయిన నివృత్తి చేసుకొన వలయునని నిశ్చయము జేసికొని యడిగినాడు,—

'నే నెవ్వడను'? అని.

ఆమాట చెవిసోకగనే నిర్ఘాంతపడినట్లు పలుకక నిలిచినది వేత్రధారిణి. అది తన ప్రశ్న నర్థముజేసికొనలేదని తలచి అడిగినాడు మరల 'నేనెవ్వడను' అని. అవసరిక ధైర్యము దెచ్చుకొని కరములు మొగిడ్చి చెప్పినది.

'చిత్తైసు, దేవా! ఏలినవారీ యధమదాసి నేలనో హేళనసేయ దలపెట్టినారు. స్వామివారు తమ్మెఱుగరా? మనవిచేసికొనియెదను, చిత్తగింప కర్తలు. వినుడు— ఏలినవారు శ్రీ మహారాజాధిరాజపరమేశ్వర, యరిరాయవిభాళ, భాషగెతప్పువ రాయరగండ, అష్టదిగ్రాయ భయంకర, మూరు రాయరగండ, యవనరాజ్యస్థాపనాచార్య, సాహితీ సమరాంగణ సార్వభౌమ, విద్యానగర సామ్రాజ్యాధీశ్వర శ్రీ వీరప్రతాప శ్రీకృష్ణదేవమహారాయల వారు.'

'నేను కృష్ణదేవమహారాయలనా?'

'సందేహమేల మహాప్రభూ?'

'మఱి నేనెచ్చట నున్నాడను.'

'అంతఃపురమున వైజయంతీ సదనమున.'

'ఇచ్చటికి నేనెట్లు వచ్చితిని?'

'ఎప్పటివలెనే.'

'అట్లనిన?'

'సందె కొలువు సాలించిన తరువాత అప్పాజీవారితో ముచ్చటలాడుచు విజయము చేసితిరి.'

ప్రోలయకు సందేహములు తీఱుటకు మాఱు వృద్ధియైనవి. తానట! కృష్ణదేవ మహారాయలంట! ఏమి చిత్రము. యోచించి చూడఁగా నది యేదో నాటకమువలె దోఁచుచున్నది. కాని యీ నాటకము నాడించు సూత్రధారుఁ డెవ్వఁడు? ఎవ్వడైన నేమి? తా నతని చేతి జంత్రపు బొమ్మయైనాడు. అతఁడెట్లాడించిన నట్లాడవలసి యున్నది. ఎట్లు పర్యవసానము గాబోవుచున్నదో? ఎప్పటికేది ప్రస్తుతమో అప్పుడుదానిననుసరించుట శ్రేయస్కరమని పెద్దలు చెప్పుదురు. కావున నవసరిక చెప్పినట్లు తానే రాయలని తలచి ప్రవర్తించుట యుక్తమని నిశ్చయించి రాయపావలుమెట్టి బయలువెడలెను.

(ఇంకా వుంది)

# రాజ్యాంగము - వ్యక్తిస్వాతంత్ర్యము

తాడిమళ్ల జగన్నాథరావు

నిరంకుశ ప్రభుత్వాల పరిపాలనలోతప్ప, తదితర ప్రభుత్వాల పరిపాలనలో ప్రజల హక్కులకు రక్షణ ఉంటూంటుంది. ప్రభుత్వపు నిరంకుశత్వం మరీ బలసిననాడు, ప్రజావిప్లవాలు చెలరేగడం, తద్వారా ప్రభుత్వపతనం సంభవించడం జరుగుతూ ఉంటుంది. ఈ విషయం మనకు చరిత్ర ఋజువుపరుస్తుంది. ఇంగ్లండుదేశపు రాజుల నిరంకుశత్వమే 'మేగ్నకార్టా', 'బిల్ ఆఫ్ రైట్సు' లకు కారణం. ఫ్రాన్సు, రష్యాలలోని విప్లవానికికూడా ప్రజల హక్కులకు భంగం కలగడమే కారణం. అమెరికా చరిత్రకూడ ఈ విషయాన్ని స్పష్టపరుస్తుంది. ప్రస్తుతం ప్రపంచంలో పనిచేస్తున్న ప్రభుత్వాలన్నీ ప్రజాప్రభుత్వా లనిపించుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రజాప్రభుత్వ సూత్రాలను పాటించడం విషయంలో వివిధదేశ ప్రభుత్వాలలో తారతమ్యం కనపడుతూ ఉంటుంది. కాని ప్రజాప్రభుత్వాల అన్నిటి ముఖ్యాశయం ప్రజాస్వాతంత్ర్యాన్ని కాపాడ్డమే. ప్రజాప్రభుత్వయుగంలో కూడా దక్షిణాఫ్రికావంటి దేశాలు ఆదేశంలోని ఒక తెగవారి స్వాతంత్ర్యాన్ని అరికట్ట చూస్తున్నాయి. ఈ దక్షిణాఫ్రికా ప్రభుత్వపథకం ఎలాంటి విషమ సంఘటనలకు దారి తీస్తుందో చరిత్ర నిర్ణయిస్తుంది.

ప్రజల హక్కులు కొన్ని రాజ్యాంగాల్లో నిర్వచించి ఉంటాయి. ప్రజలు తమ హక్కులకు భంగంకలిగిందని తోస్తే న్యాయస్థానాల ద్వారా తమ హక్కుల్ని నిలుపుకోకలిగి ఉంటారు. ఇంగ్లండు రాజ్యాంగంలో ప్రజాస్వాతంత్ర్యాన్ని నిలిపేది 'కామన్ లా'. 'మేగ్నకార్టా', 'బిల్లు ఆఫ్ రైట్స్' మొదలైన వేవో కొన్ని తప్ప తతిమా